క్లుప్తంగా

జాబ్ మేళాలో 32 మందికి ఉద్యోగాలు



నరసరావుపేట ఈస్ట్: కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని స్కిల్ హబ్ నాక్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన జాబ్ మేళాలో 32 మంది ఉద్యోగాలకు ఎంపికై నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. టాటా కాపిటల్, పేటీఎం, జయలక్ష్మి ఆటోమోటివ్, మాస్టర్ మైండ్స్ వంటి సంస్థలు జాబ్ మేళాకు హాజరై అర్హులైన అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 80 మంది హాజరు కాగా 32 మంది ఉద్యోగాలకు ఎంపికై నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాక్ ట్రైనింగ్ సెంటర్ ఏడీ నరసింహారావు, జిల్లా ఆదనపు నైపుణ్యాభివృద్ధి అధికారి వి.సీహెచ్.రామాంజనేయులు, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఎం.వీరాంజనేయులు, జె.సురేష్, ఏ.రమ్య పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై అవగాహన ఉండాలి



శావల్యాపురం: పంచాయతీ నిధులు వినియోగం పరిపాలన తదితర వాటిపై గ్రామస్థాయిలో ఉప సర్పంచులు వార్డు సభ్యులు అవగాహన కల్గియుండాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచులు వార్డు సభ్యులు శిక్షణతరగతులు ముగింపు సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఆర్థిక సంఘం నిధులను తాగునీరు, వీధిలైట్లు, పారిశుద్ధ్యం, శానిటేషన్ పనులకు అధికంగా వెచ్చించాలన్నారు. గ్రామాభివృద్ధిలో ఉప సర్పంచులు వార్డు సభ్యులు కీలకపాత్ర పోషించాలన్నారు. కేంద్ర -రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు అర్హత కల్గియున్న లబ్ధిదారులకు అందేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, ఏపీవో కె.రామారావు, రిసోర్స్ పర్సన్లు చింతా శ్రీనివాసరావు, మంద్రు మనోహర్‌లు పాల్గొన్నారు.

కవి కరిముల్లాకు అబ్దుల్ కలాం అవార్డు



వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన ప్రసిద్ధ కవి కరీముల్లాకు అబ్దుల్ కలాం అవార్డు లభించింది. తెలుగు సాహిత్య రంగంలో కవిగా కరిముల్లా చేసిన రచనలు సమాజాన్ని జాగృతం చేసే విధంగా విశేష ప్రభావాన్ని కలిగించాయని నూర్ బాషా ముస్లిం ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో ఈ నెల 13న జరిగే జాతీయ మేధావుల సదస్సులో ఏపీజే అబ్దుల్ కలాం అవార్డును అందించన్నుట్లు నిర్వాహకులు తెలియజేసినట్లు కవి కరిముల్లా వివరించారు. కరిముల్లా ఇప్పటివరకు 26 పుస్తకాలు రాశారని, ఆయన కవిత్వం ఇంగ్లిష్, కన్నడం, హిందీ, ఉర్దూ, ఒరియా భాషల్లో అనువాదమై దేశ వ్యాప్తంగా అనేక విశ్వవిద్యాలయాల్లో పరిశోధనాంశంగాను, పాఠ్యాంశాలుగా ఉన్నాయి. అవార్డు పొందిన కవి కరిముల్లాను పట్టణానికి చెందిన పలువురు కవులు, కళాకారులు అభినందించారు.

పారదర్శక సేవలు అందించాలి


శావల్యాపురం: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు పారదర్శకంగా అందేలా క్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్య సిబ్బంది బాధ్యత వహించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణణ్ అన్నారు. మంగళవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బందికి ఆరోగ్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఈసమావేశంలో వైద్యాధికారి రావిపూడి రమ్య, సూపర్‌వైజర్లు అలవలపూడి ఏడుకొండలు, ఉమాదేవి ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మూడు ఇసుక టిప్పర్లు స్వాధీనం

నాదెండ్ల: అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు టిప్పర్లను పోలీసులు స్వాధీనం చేసుకుని నరసరావుపేట మైనింగ్ అధికారులకు మంగళవారం అప్పగించారు. ప్రకాశం జిల్లా టుంగుటూరు పరిధిలోని వాగుల నుండి ఇసుకను అక్రమంగా తవ్వి టిప్పర్లలో తరలించి అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసులకు అందిన సమాచారంతో రూరల్ సీఐ సుబ్బానాయుడు, సిబ్బందితో దాడి చేయగా, గణపవరం వద్ద రెండు టిప్పర్లు, జాతీయ రహదారిపై హెల్త్ క్లబ్ సమీపంలో వేబ్రిడ్జి వద్ద మరో టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి వేబిల్లులు లేకుండా ఓవర్ లోడ్‌తో ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఒక్కో టిప్పర్‌లో 40 టన్నుల వరకూ ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

బెల్టు 'తీస్తేనే' దారికొచ్చేది!

- గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం
- అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్న బెల్టుషాపు నిర్వాహకులు
- పట్టించుకోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు
- 12 తర్వాత బెల్టుషాపులు పెరిగే ప్రమాదం



నాదెండ్ల: గ్రామాల్లో బెల్టు షాపులు వీధి వీధిన వెలిశాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతి గ్రామంలో నిత్యం 24 గంటలు మద్యం లభిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా బెల్టు షాపులు పెద్ద సంఖ్యలో నడుస్తున్నాయి. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యం బాటిళ్లు పెద్ద సంఖ్యలో కొనుగోలు చేసి బెల్టు షాపుల ద్వారా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. లోకల్ సరుకే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా సరుకు తెప్పించి విక్రయిస్తున్నారు. ముఖ్యంగా గోవా, పాండిచ్చేరి ప్రాంతాల్లో తక్కువ ధరకు లభించే మద్యాన్ని గుట్టుచప్పుడు కాకుండా తరలించి స్థానికంగా నిల్వ చేస్తున్నారు. గోవాలో మద్య రకం 750 ఎంఎల్ బాటిల్ ధర రూ.359లు ఉండగా, అదే బాటిల్‌ను ఇక్కడ రూ.800లకు విక్రయిస్తున్నారు.

స్థానిక ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఇదే రకం మద్యాన్ని రూ.870లకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 9 గంటల లోపే మద్యం దుకాణాలు నిర్వహించాల్సి ఉంది. బెల్టుషాపుల నిర్వాహకులు ముందుగానే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కేసులు, కేసులు కొనుగోలు చేసి రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు జాము వరకూ మద్యం అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

చిలకలూరిపేట నియోజకవర్గంలో మొత్తం 17 ప్రభుత్వ మద్యం దుకాణాలకు గాను లిక్కర్‌మాల్ ఒకటి ఉంది. పట్టణ పరిధిలో 6 మద్యం దుకాణాలు కాగా, రూరల్ పరిధిలో 3, యడ్లపాడులో 3, నాదెండ్ల మండల పరిధిలో 5 దుకాణాలు ఉన్నాయి.

గత ప్రభుత్వంలో కానరాని బెల్టు షాపులు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బెల్టు షాపులు నియంత్రణకు ఎక్సైజ్ శాఖ అధికారులు ఉక్కుపాదం మోపారు. ఎక్కడ అక్రమంగా మద్యం విక్రయించినా దాడి చేసి అరెస్టులు చేశారు. సివిల్ పోలీసులు సైతం నిఘా పెట్టి ఎక్సైజ్ సిబ్బందితో కలిసి దాడులు చేశారు. దీంతో బెల్టుషాపులు మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బెల్టుషాపుల నియంత్రణను పట్టించుకోవటం లేదు. పార్టీ మారటంతో అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు అక్రమ మద్యం దందాకు తెరలేపి యథేచ్ఛగా అమ్మకాలు చేస్తున్నారు.

దసరా నుంచి కొత్త పాలసీ

ప్రభుత్వం మద్యం దుకాణాలు పనితీరు ఇప్పుడే ఇలా ఉంటే దసరా అనంతరం ఈ దుకాణాలు మొత్తం ప్రైవేటు వ్యక్తులపరం కానున్నాయి. నూతన మద్యం పాలసీలపై ప్రస్తుతం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నెల 12వ తేదీ నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు రానున్నాయి. దీంతో గ్రామాల్లో బెల్టుషాపుల దందా తారాస్థాయికి చేరే అవకాశం ఉందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ధరకే మద్యం ఇస్తామంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు ప్రజలను అపహాస్యానికి గురిచేస్తున్నాయి. దీనిపై చిలకలూరిపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులను ఫోన్‌లో సంప్రదించే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.



గణపవరంలో ప్రభుత్వ మద్యం దుకాణం

త్వరలో ఆన్‌లైన్ సేవలు ప్రారంభం

సీఈవో జాలాది నాగప్రసాదు



శావల్యాపురం సొసైటీ కార్యాలయం

శావల్యాపురం: వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని (సొసైటీ) రైతులకు ఇక నుంచి డిజిటలైజేషన్ (ఆన్‌లైన్) విధానంద్వారా అన్నీ రకాల సేవ లు త్వరలో అందుబాటులోకి వస్తాయని సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాదు వెల్లడించారు. మంగళవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో సీఈవో నాగప్రసాదు మాట్లాడుతూ శావల్యాపురం సొసైటీ పరిధిలో 17 గ్రామాలు ఉండగా 5084 రైతులు సభ్యత్వ నమోదు చేసుకోగా 1200 మంది అప్పుదారులు ఉన్నట్లు చెప్పారు. సొసైటీ పరిధిలో ఉన్న ఖాతాదారులు సమగ్ర వివరాలతో కూడిన సమాచారం ఆన్‌లైన్ నూరుశాతం పొందిపరిచినట్లు తెలిపారు. సొసైటీ పరిధిలో వేల్పూరులో శీతల గిడ్డంగి కేంద్రం, ఎరువులు పురుగుమందులు రైతులకు రుణాలు నిమిత్తం ఇప్పటి వరకు రూ.60 కోట్లు ఆర్థిక లావాదేవీలు నిర్వాహణ చేసినట్లు తెలిపారు. అలాగే 121 స్వయం సహాయక సంఘాల్లోని మహి ళా సభ్యులకు రూ.10 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సొసైటీల్లోని రైతుల సమగ్ర వివరాలు ఆన్‌లైన్ విధానం చేయటం ద్వారా రుణాలు మంజూరు సొసైటీ సేవల్లో అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా రైతులకు సేవలు ఆన్‌లైన్ విధానంలో అందుతాయన్నారు. ఆయనతో పాటు సొసైటీ సిబ్బంది రామాంజనేయులు, సతీష్, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలి



మాట్లాడుతున్న డీపీవో భాస్కర్‌రెడ్డి

వినుకొండ(నూజెండ్ల): గ్రామాల్లో ప్రభుత్వ ఆస్తులను గుర్తించి సంపదను ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి ఎం.ఈ. భాస్కర్ రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐదు మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రభుత్వ ఆస్తులను గుర్తించాలని, ఇంటి పన్ను, నీటి పన్ను, సెల్‌టవర్ల లైసెన్స్ ఫీజులు ప్రభుత్వం షాపుల అద్దె వసూళ్లు వంటివి వెంటనే వసూళ్లు చేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చాలన్నారు. దీంతో గ్రామాల అభివృద్ధి చేసుకోవాలని, ఉపాధి హామీ నిధులు కూడా సమీకరించుకొని అభివృద్ధి పనులు, అంచనాలు రూపొందించి గ్రామాల సమగ్ర అభివృద్ధిని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవోలు జానీబాషా, సుందరరెడ్డిలతో పాటు ఆయా మండలాల ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ నమోస్తుతే



శావల్యాపురంలో శ్రీ గాయత్రిదేవిగా..



వినుకొండలో ప్రత్యేక అలంకరణలో..



గణపవరంలో ధనలక్ష్మిగా



లింగారావుపాలెంలో ధనలక్ష్మిగా..



రొంపిచర్లలో ధనలక్ష్మీ దేవిగా



నరసరావుపేటలో మహాలక్ష్మీగా..



నరసరావుపేటలో మహాలక్ష్మీగా..



విప్పర్లలో శ్రీ మహాలక్ష్మీగా..

బాలిక సంరక్షణ చట్టంపై పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నరసరావుపేట రూరల్: శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో బాలిక సంరక్షణ చట్టంపై జిల్లాస్థాయి వ్యాసరచన, క్విజ్, పెయింటింగ్ పోటీలను మంగళవారం నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ, విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు హాజరైయ్యారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉప మీడియా విస్తరణ అధికారి పాల్గొని బాలికా సంరక్షణ చట్టం, బాలికలు ఎదుర్కొనే సమస్యలను విద్యార్థులకు తెలిపారు. వ్యాసరచన పోటీలో ఓ.చంద్రిక (యల్లమంద), ఎం.హరిణి(గణపవరం), కె.భాను (శంకర భారతీపురం), డ్రాయింగ్ పోటీల్లో జె.శృతికషైనీ (సత్తెనపల్లి), టి.సంధ్యారాణి (ఇస్సప్పాలెం), వి.చంద్రహసిని (శంకరభారతీపురం), డిబేట్‌లో ఎస్‌కె. పి.ఆసియా (యల్లమంద), డి.భార్గవ్ (ఫణిదం), కె.రష్మిత (కనపర్రు)లు విజేతలుగా నిలిచారు. పోటీలను డీఎస్‌వో యస్.రాజశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు పార్వతి, ఉపాధ్యాయులు వరప్రసాద్, పూర్ణ, శివరాజు, సుబ్బారావు, లక్ష్మీ, వెంకటరత్నంలు నిర్వహించారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా ఈనెల 11వ తేదీన విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

మురుగుకాల్వల ఆక్రమణదారులకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్



నోటీసులిస్తున్న సిబ్బంది

నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో పారిశుద్ధ్యం అధ్వానంపై అధికారులు స్పందించారు. ఇటీవల సాక్షి దిన పత్రికలో వచ్చిన కథనంపై మంగళవారం సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మురుగు కాల్వలపై ఆక్రమణలు కట్టి మురుగు పారుదలకు ఆటంకం కలిగిస్తున్న వారికి నోటీసులు అందించారు. రెండు రోజుల్లో కాల్వలపై నిర్మించుకున్న కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. సినిమా హాల్ రోడ్డుకు ఇరువైపులా సైడు కాల్వలపై నిర్మాణాలు చేయటంతో మురుగునీరు పారుదల సౌకర్యం లేక నడిరోడ్డుపై మురుగు చేరి పారిశుద్ధ్య సమస్యలు తీవ్రమయ్యాయి. రోడ్డుపై ప్రయాణించాలంటే దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించకుంటే మంచిదనీ, లేకుంటే తామే ప్రొక్లెయినర్‌తో పూర్తిగా తొలగించి పారిశుద్ధ్య పనులు చేపడతామని పంచాయతీ కార్యదర్శి ఎస్ మారుతీ బాబు వివరణ ఇచ్చారు.

మరొకరితో సహజీవనం చేస్తూ భార్యపై వేధింపులు

- నగ్నంగా వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్
- నిందితులను అరెస్ట్ చేయాలని డీఎస్పీని కోరిన బాధితురాలు

నరసరావుపేటటౌన్: తన భర్త మరో యువతితో సహజీవనం చేస్తూ అడిగి నందుకు తనపై దాడి చేయటంతో పాటు నగ్నంగా వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టారని బాధితురాలు మంగళవారం డీఎస్పీ కె. నాగేశ్వరరావుకు ఫిర్యాదు చేసింది. అనంతరం చిలకలూరిపేట పట్టణానికి చెందిన బాధిత మహిళ డీఎస్పీ బంగ్లా ఎదుట విలేకరులతో మాట్లాడింది. తన భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని తెలిపింది. ఈ వ్యవహారంపై ప్రశ్నించినందుకు సదరు మహిళ కొంత మందితో ఇంట్లోకి దౌర్జన్యంగా వచ్చి దాడి చేశారని తెలిపింది. తనను నగ్నంగా చేసి వీడియోలు తీశారని వాటిని సోషల్ మీడియాలో పెట్టారని వాపోయింది. ఫిర్యాదు చేయటంతో ఏడాది క్రితం చిలకలూరిపేట పట్టణం పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపింది. అయితే నిందితులను అరెస్ట్ చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొంది.

భర్త ప్రవర్తన మార్చుకోకపోవటంతో ఐదు నెలల క్రితం విడాకులు తీసుకున్నట్లు తెలిపింది. నిందితులను అరెస్ట్ చేసి తనకు న్యాయం చేయాలని కోరింది.

11న బతుకమ్మ అలంకరణ పోటీ

నరసరావుపేట ఈస్ట్: శ్రీవాసవీ మిత్రమండలి ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన శ్రీవాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయం వద్ద వాసవీ, బతుకమ్మ అమ్మవార్ల బొమ్మల అలంకరణ పోటీలు నిర్వహిస్తున్నట్లు మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. పోటీలో పాల్గొనేవారు తమ ఇంటి వద్దనే బొమ్మలను అలంకరించుకొని తీసుకుని రావాలన్నారు. పోటీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, రెండు కన్సోలేషన్ బహుమతులతో పాటు ఎంపిక చేసిన 45 మందికి చీరలు, పాల్గొన్న వారికి ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. పోటీలో పాల్గొనేవారు తమ పేర్లను 9246453348, 9848147744, 7337071287, 7075740630 నెంబర్లకు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని తెలిపారు.

యువకుడిపై దాడి

నరసరావుపేటటౌన్: స్వల్ప వివాదం నేపథ్యంలో యువకుడిపై ఐదుగురు యువకులు దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం పట్టణంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాలెంనగర్‌కు చెందిన చావ లక్ష్మీనారాయణపై నాగబాబు మరో నలుగురు కలిసి దాడి చేశారు. ఈమేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ విజయ్‌చరణ్ తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామం సమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు ఈతకు వెళ్ళి ప్రమాదవశాత్తు మృత్యువాత పడిన కవలకుంట సతీష్ మృతదేహం మంగళవారం ఉదయం గుర్తించినట్లు ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో మృతదేహం కోసం పోలీసు, రెవెన్యూ సిబ్బంది కుటుంబ సభ్యులు కాల్వ వెంట వెతుకులాట చేస్తుండగా అడవిపాలెం లాకుల వద్ద మృతదేమం లభ్యమైనట్లు ఎస్సై తెలిపారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

నరసరావుపేట రూరల్: మద్యానికి బానిసైన ఆటో డ్రైవర్ తమ్మిరాజు(35) పురుగుమందు సేవించి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ మంగళవారం సాయంత్రం తెలిపారు. భార్య కుమ్మెర శివదుర్గ సోమవారం రాత్రి ఫిర్యాదు చేసిందన్నారు. మూడురోజుల క్రితం లింగంగుంట్ల కాలనీలోని ప్రభుత్వాసుపత్రి పరిసరాల్లో తన భర్త ఆటోలో పురుగుమందు సేవించి ఉండగా మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లటం జరిగిందన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

ఆటో డ్రైవర్‌లకు ట్రాఫిక్ సీఐ హెచ్చరిక



ఆటో డ్రైవర్‌లతో మాట్లాడుతున్న సీఐ లోక్‌నాథ్

నరసరావుపేట టౌన్: ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ లోక్‌నాథ్ హెచ్చరించారు. మంగళవారం ఆటో డ్రైవర్‌లతో ట్రాఫిక్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆటో డ్రైవర్‌లు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలన్నారు. నడిరోడ్లపై ఆటోలు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటుండంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. ఆటోలను పోలీస్ శాఖ నిర్దేశించిన పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే నిలుపుకోవాలన్నారు. ప్రతి ఆటో డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా, అతి వేగంగా వాహనం నడిపినా చర్యలు తీసుకుంటామన్నారు. మొదట జరిమాన, రెండవ సారి పట్టుబడితే వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వేర్వేరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం



యడ్లపాడు మండలంలో సూచనలు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు, కర్లకుంట గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమానిన వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రస్తుత తరుణంలో వరిపైరులో ఆకుచుట్టు పురుగు ఉందన్నారు. ఈ పురుగు నివారణకు కొబ్బరి పీచు తాడును రెండు వైపులా పట్టుకొని వరిపైరులో లాగాలన్నారు. లేదా ఒక చెట్టు కొమ్మలను, ముళ్ల మండలను వరిపైరులో లాగితే ఆకుచుట్ట పురుగు నీటిలో పడి చనిపోతుందన్నారు. ఇలా చేయటం వల్ల పురుగు మందు ఖర్చును తగ్గించుకోవచ్చు అన్నారు. సూటి ఎరువులు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారితో పాటు పశువైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్, వీఏఏలు హరీష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఈపూరు: మండలంలోని కొచ్చర్ల, ఉప్పరపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రైతులతో కలిసి పొలాలను ఏఈవో అప్పారావు, వ్యవసాయ సిబ్బంది పరిశీలించారు. కాంప్లెక్స్‌ను ఎరువులను తగిన మోతాదులో వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ కిషోర్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

శావల్యాపురం: వరి పంటలో వచ్చే తెగుళ్లకు రైతులు తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. మంగళవారం మండలంలోని శానంపూడి, ముంద్రువారిపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ అధికారులు నిర్వహించారు. రసాయనిక ఎరువులు అధికంగా వినియోగించటం వలన భూమిలో ఉండే పోషకాలు తగ్గుతాయన్నారు. ఆయనతో పాటు ఏఈవో పురేటి ఈశోక, వీఏఏ ఏ.ఇర్మియా, నాగేశ్వరావు,రైతులు పాల్గొన్నారు.

నాదెండ్ల: కనపర్రు, అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పల్నాడు జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం శివకుమారి, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, ఏవో హరిప్రసాద్, వెటర్నరీ, ఉద్యానవన సహాయకులు హాజరయ్యారు. భూసార పరీక్షలు, విత్తన శుద్ధి, వేపకషాయం తయారీ, వినియోగించే విధానంపై రైతులతో మాట్లాడారు.

యడ్లపాడు: మండలంలోని కారుచోల, గుత్తావారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. స్థానిక వ్యవసాయాధికారి సరిత, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ అధికారులు హాజరయ్యారు. క్షేత్రస్థాయితో పత్తి, మిర్చి పంటలను పరిశీలించారు. పత్తిలో రసంపీల్చే పురుగు, గులాబీరంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై వివరించారు. రబీలో పొగాకు, శనగ పైర్ల సాగుపై అవగాహన కల్పించారు.

ప్రజావసరాలు తీర్చేందుకే పనిచేయాలి

మునిసిపల్ అధికారులకు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ సూచన



పారిశుద్ధ్య పని గురించి ఎమ్మెల్యే చదలవాడకు వివరిస్తున్న కమిషనర్ జస్వంతరావు

నరసరావుపేట: ప్రజల అవసరాలు తీర్చేందుకే ఉద్యోగాలు చేస్తున్నట్లు ఉద్యోగస్తులు గుర్తించుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో పారిశుద్ధ్యంపై సుడిగాలి పర్యటన చేశారు. స్థానిక మల్లమ్మ సెంటర్, స్టేషన్‌రోడ్డు, సత్తెనపల్లి రోడ్డు, రావిపాడు రోడ్డు ప్రధాన రహదారులు వెంబడి పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. మురికినీరు, చెత్తా, చెదార్థం పేరుకు పోవడాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. పట్టణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, నాయకులు వాసిరెడ్డి రవి, కొవ్వూరి బాబు, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

బార్ యజమానులపై చర్యలు తీసుకోవాలి

నరసరావుపేట: స్థానిక ఇస్లాంపేటకు చెందిన షేక్ ఘనీ, జానీల ముస్లిం కుటుంబాలపై మూక దాడిచేసి కుటుంబ సభ్యులందరినీ చంపేస్తామని బెదిరించిన జీవనజ్యోతి బార్ యజమానులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావులను బాధితులు, ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు వారు కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) సీనియర్ నాయకులు నల్లపాటి రామారావు మాట్లాడుతూ జీవనజ్యోతి బార్ యజమానులు అధికార అండదండలతో మూకబలంతో ముస్లిం కుటుంబంపై దాడి చేశారని, దీన్ని ప్రజా సంఘాలుగా తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే నిందితులైన యజమానులు అనిల్, కిషోర్ వారి అనుచరులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. పీడీఎం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, బీసీ సంఘం నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు, ఎంసీపీఐ నాయకులు అబ్రహం లింకన్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు వి.కోటానాయక్, బాధిత కుటుంబం షేక్ ఘని గౌసియా పాల్గొన్నారు.

యడ్లపాడు డీటీగా అనురాధ



అనురాధ

నాదెండ్ల: యడ్లపాడు డిప్యూటీ తహశీల్దార్‌గా ఎస్ అనురాధ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె నాదెండ్ల డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన ఆమెను కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కారుచోల వీఆర్వోగా కె.అగస్త్యలింగాచారి, జాలాది వీఆర్వోగా ఏఏ బాషా, ఉన్నవ వీఆర్వోగా కె.అశోక్, కొండవీడు వీఆర్వోగా కృష్ణచైతన్య, యడ్లపాడు-2 వీఆర్వోగా రఫీలయ్య, చెంఘీజ్‌ఖాన్‌పేట వీఆర్వోగా బాబూరావు, వంకాయలపాడు వీఆర్వోగా శివకోటేశ్వరరావు, మైదవోలు వీఆర్వోగా అనూష విధుల్లో చేరారు.

మొక్కలు పెంపకంపై అవగాహన సదస్సు

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో అటవీ యేతర ప్రాంతంలో మొక్కలు పెంపకం కార్యక్రమంపై రైతులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ట్రీస్ ఔట్‌సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా పోగ్రాం స్టేట్ అసోసియేట్ అధికారి మారపల్లి ప్రణీత్ వర్మ పాల్గొని మాట్లాడుతూ రైతులు ఆగ్రో ఫార్మసీపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఉద్యాన వన మొక్కలు అడవి జాతి మొక్కలు వ్యవసాయ భూమిలో నాటితే దాని వలన వచ్చే ప్రయోజనాలు ఆదనపు ఆదాయం గురించి రైతులకు వివరించారు. ఈసమావేశంలో విహెచ్ఏ జంపాల ప్రసాదు, రైతులు పాల్గొన్నారు.